క్లుప్తంగా

ప్రశంసపత్రాల అందజేత



మహబూబాబాద్ అర్బన్: జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని ఏకశిల హోలిఏంజిల్స్ హైస్కూల్‌లో ఉపన్యాస, వ్యాసరచన పోటీలు శనివారం నిర్వహించారు. గెలుపొందిన వారికి జిల్లా అదనపు కలెక్టర్ లెలిన్ వత్సల్ టోప్పో చేతుల మీదుగా బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ ఏ. రవీందర్ రెడ్డి, జిల్లా ఏఎంఓ చంద్రశేఖర్‌ఆజాద్, సైన్స్ అధికారి అప్పారావు, ఎంఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు

మహబూబాబాద్ రూరల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. సీఐ పెండ్యాల్ దేవేందర్ ఆధ్వర్యంలో బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందం సభ్యులు, పోలీసు అధికారులు తనిఖీలు చేపట్టారు.

పలువురికి ఉత్తమ బీఎల్‌ఓ అవార్డుల ప్రదానం



గూడూరు: గణతంత్ర దినోత్సవ వేడుకలను పరుస్కరించుకొని శనివారం పలువురికి ఉత్తమ బీఎల్‌ఓ అవార్డులు ప్రదానం చేశారు. గూడూరు మండలంలోని మారుమూల ఏజెన్సీ అటవీ గ్రామం మట్టెవాడకు చెందిన బీఎల్‌ఓ హరిబండి లక్ష్మయ్య కలెక్టర్ చేతుల మీదుగా శనివారం ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు.
మరిపెడ రూరల్: మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ బెస్త సంపూర్ణకు ఉత్తమ బీఎల్‌ఓగా హైదరాబాద్‌లో అవార్డు అందజేశారు.
దంతాలపల్లి మండలం వేములపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ పొద్దుటూరి పద్మ మండల ఉత్తమ బీఎల్‌ఓగా ఎంపికైంది.

ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి

నెహ్రూసెంటర్: సీపీఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆశకార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆశకార్యకర్తలు ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్‌కు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆశలు రజిని, రేణుక పాల్గొన్నారు.

మూగజీవాలను సంరక్షించాలి

మహబూబాబాద్: భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఏజీ ప్రకారం మూగజీవాలను సంరక్షించే బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని జిల్లా పశు వైద్య, పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ బి.కిరణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ సంవత్సరం జనవరి 14 నుంచి 31వ తేదీ వరకు జంతు సంరక్షణ పక్షోత్సవాలను నిర్వహిస్తుందన్నారు. భూమి మీద నివసించే హక్కు మనుషులతోపాటు మూగజీవాలకు కూడా ఉందనే విషయాన్ని ప్రజలు గుర్తు పెట్టుకోవాలన్నారు. జంతువులను అమానుషంగా చంపడం, కొట్టడం, క్రూరంగా వ్యవహరిస్తే చట్టం ప్రకారం చర్యలు ఉంటాయన్నారు.

శంకుస్థాపన

నెహ్రూసెంటర్: మున్సిపాలిటీ పరిధిలోని 22, 36 వార్డుల్లో సీసీ రోడ్డు పనులను ఎంపీ పోరిక బలరాంనాయక్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, 36వ వార్డు కౌన్సిలర్ బి.నీరజారెడ్డి ధర్మన్న, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మధన్‌లోయ పాల్గొన్నారు.

పదుల సంఖ్యలో కోతుల కళేబరాలు



కురవి: మండలంలోని బంచరాయి తండా గ్రామం పరిధిలోని మున్నేరు వాగు సమీపంలో పదుల సంఖ్యలో కోతుల (వానరాలు) కళేబరాలను శనివారం రాత్రి తండావాసులు గుర్తించారు. తండా సమీపంలోని మున్నేరు వాగు వద్ద దుర్వాసన రావడంతో రైతులు చూడగా సుమారు 50 నుంచి 60 కోతుల కళేబరాలు కుప్పగా పోసి ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు కోతులను చంపేసి ఇక్కడ పడేసినట్లు భావిస్తున్నారు. అటవీశాఖ అధికారులు, పోలీసులు విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని తండావాసులు కోరుతున్నారు.

ఓటుహక్కు వజ్రాయుధం లాంటిది

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. వృద్ధ ఓటర్లను, కొత్త ఓటర్లను సన్మానించారు. ఈసందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన గొప్ప ఆయుధం ఓటు హక్కు అని, ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. - సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్: సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి



మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ భగవాన్‌రెడ్డి



బయ్యారం: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్



మరిపెడ: వృద్ధ ఓటరును సన్మానిస్తున్న ఆర్డీఓ గణేష్‌బాబు



గార్ల: సీహెచ్‌సీలో ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్లు, వైద్యసిబ్బంది



గూడూరు: ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ శ్వేత



గార్ల హైస్కూల్లో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు



కురవి: ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధికారులు



నెల్లికుదురు: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



దంతాలపల్లి: ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దారు రాజేశ్వర్, తదితరులు



డోర్నకల్‌లో ఓటరు దినోత్సవ ర్యాలీ

ఎస్సారెస్పీ జలాలను విడుదల చేయాలి

నెల్లికుదురు: ఎస్సారెస్పీ కాల్వ జలాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ధర్నాకు దిగారు. మండల కేంద్రంలో శనివారం నెల్లికుదురు నుంచి మహబూబాబాద్ వెళ్లే ప్రధాన రహదారిపై నెల్లికుదురు, జామ్లాతండా రైతులు ధర్నాకు దిగారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వరి నాట్లు వేసి నెల గడుస్తున్నా ఇప్పటి వరకు 10ఆర్1 కెనాల్ కాల్వ మీఠ్యతండా నుంచి నైనాల, సెక్రెడ్ హార్ట్ పాఠశాల పక్క నుంచి జామ్లా తండా మీదుగా వచ్చే కాల్వకు జలాలు రావడం లేదన్నారు. రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోకుండా అధికారులు చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు సంతోష్, భిక్షానాయక్, సూర్య, పంతులు, వెంకటేష్, మంగిలాల్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

దాతల సహకారం అభినందనీయం

● ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మరిపెడ రూరల్: గ్రామాభివృద్ధిలో దాతల సహకారం ఎంతో అభినందనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. మరిపెడ మండలం నీలికుర్తి రెవెన్యూ పరిధిలోని నూతనంగా ఏర్పాటు చేసిన రేఖ్యాతండా గ్రామ పంచాయతీ పరిధి మూన్యతండాలో అదే తండాకు చెందిన దాత బానోతు లక్‌పతి తన సొంత ఖర్చులతో రూ.40వేలు వెచ్చించి 30 ఎల్ఈడీ వీధి లైట్లను ఏర్పాటు చేయించాడు. ఇట్టి వీధి దీపాలను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. అనంతరం అక్కడే ఉన్న మైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మనోహర్, నరేష్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



వీధి లైట్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మరిపెడ: ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ సైదులు అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా మరిపెడ ఆడిటోరియంలో డోర్నకల్ నియోజక వర్గంలోని ఏడు మండలాల విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్‌తో పాటు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మరిపెడ ఇన్‌చార్జ్ ఎంఈఓ అనితాదేవి, న్యాయనిర్ణేతలుగా శ్రీశైలం, రామ్మోహన్, శాంసన్, తదితరులు పాల్గొన్నారు.
తొర్రూరు రూరల్: భారత రాజ్యాంగంపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని సొసైటీ ఫర్ సోషల్ సర్వీస్ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది పాడకంటి యాకాంబ్రం కోరారు. శనివారం మండలంలోని అమ్మాపురం జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాది బొర్ర కుమార్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు..



మరిపెడ: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్నతహసీల్దార్ సైదులు

రాజకీయాలకతీతంగా అభివృద్ధి

● ఎమ్మెల్సీ రవీందర్‌రావు

మహబూబాబాద్: అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో శనివారం సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్సీ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ రవీందర్‌రావు మాట్లాడుతూ.. రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. అభివృద్ధి పనుల విషయంలో తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, నాయకులు రఘు, శంకర్, కిరణ్, గోపాల్, నాగరాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

ఆలయ అభివృద్ధికి విరాళాల అందజేత

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని ఆకేరువాగు ఒడ్డున వెలసిన గంగమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం కోసం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. మండల కేంద్రానికి చెందిన రావుల రంగారెడ్డి రూ.50వేలు, మాజీ సర్పంచ్ కొమ్ము మల్లయ్య రూ.30వేలు, దాశరథి మెడికల్ షాప్ ఓనర్ గోపగాని మల్లేష్ రూ.10వేలు యాదవ సంఘం కమిటీ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు నర్సయ్య, బొల్లు వెంకన్న, చిత్తారి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గుడుంబా స్థావరాలపై శనివారం ఎక్సైజ్, డీటీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించారు. మండలంలోని సీత్లాతండా, చిన్నలింగ్యతండా, వేమునూరు గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించగా 25లీటర్ల గుడుంబా, 130కిలోల నల్లబెల్లం, 15కిలోల పటిక స్వాధీనం చేసుకున్నారు. అజ్మీర రాము, అజ్మీర స్వరూప, అజ్మీర లాల్ సింగ్, అజ్మీరా బిచ్చాలి, భూక్యా ఉమపై కేసులు నమోదు చేసి, తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐలు చిరంజీవి, నాగేశ్వర్ రావు, ఎస్సైలు చంద్రశేఖర్, మౌనిక, కిరీటి పాల్గొన్నారు.

రూ.60వేల జరిమానా..

పట్టణ శివారులోని బాబునాయక్ తండాకు చెందిన బానోతు కృష్ణ, తేజావత్ నరేష్‌లను బైండోవర్ ఉల్లంఘన కేసులో భాగంగా తహసీల్దార్ ఒక్కొక్కరికి రూ.30వేల చొప్పున రూ.60వేల జరిమానా విధించగా జరిమానా చెల్లించారని ఎక్సైజ్ సీఐ చిరంజీవి తెలిపారు. స్తున్న అధికారులు

ప్రజల కోసం పనిచేసిన వారికి గుర్తింపు

● మాజీ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: ప్రజల కోసం పని చేసిన వారికి గుర్తింపు లభిస్తుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. పదవీకాలం పూర్తి చేసుకున్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులకు శనివారం డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దయాకర్‌రావు మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధిలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యుల పాత్ర కీలకమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.100కోట్ల నిధులు తీసుకువచ్చి పట్టణ అభివృద్ధికి పాటుపడ్డామని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, పట్టణ అధ్యక్షుడు రామిని శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, నాయకులు డాక్టర్ సోమేశ్వర్‌రావు, కుర్ర శ్రీనివాస్, ప్రమోద్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



పదవి కాలం పూర్తి చేసుకున్న కౌన్సిలర్లను, కోఆప్షన్ సభ్యులను సన్మానిస్తున్న దయాకర్‌రావు

నష్టపరిహారం అందించాలి



అధికారులను నిలదీస్తున్న రైతులు

డోర్నకల్: నకిలీ పురుగుమందు పిచికారీతో పంటలు దెబ్బతిన్న తమకు నష్టపరిహారం అందించాలంటూ చిలుకోడుకు చెందిన రైతులు వ్యవసాయ అధికారులను నిలదీశారు. మండలంలోని చిలుకోడు గ్రామంలో కృష్ణా ట్రేడర్స్ నుంచి కొద్ది రోజుల క్రితం ఓ పురుగుమందును కొనుగోలు చేసి పిచికారీ చేయగా పంట దెబ్బతిందన్నారు. సోమవారం రైతులు చిలుకోడులోని కృష్ణా ట్రేడర్స్ ఎదుట ఆందోళన నిర్వహించగా విచారణ జరుపుతామంటూ హామీ ఇచ్చారు. ఆదివారం ఏడీఏ రవిచంద్ర, ఏఓ మురళీమోహన్ సదరు దుకాణం వద్ద విచారణ జరపగా రైతులు తమకు న్యాయం చేయాలంటూ అధికారులను నిలదీశారు. విచారణ జరుపుతామంటూ అధికారులు వెళ్లిపోయారు.

‘ఉపాధి హామీలో అవినీతి బాగోతం’

మరిపెడ రూరల్: మరిపెడ మండలం నీలికుర్తి గ్రామంలోని ఉపాధి హామీపై నిర్వహించిన వార్షిక సోషల్ ఆడిట్ తనిఖీల్లో భారీ అవినీతి బాగోతం గ్రామసభలో బయటపడింది. ప్రభుత్వ నిధులు లక్షల రూపాయలు దుర్వినియోగం అయ్యాయని ఫీల్డ్ అసిస్టెంట్ ఉప్పలయ్యపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పనుల్లో సామాజిక తనిఖీ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో 5 పనులను గుర్తించారు. ఇట్టి పనులకు ప్రభుత్వం ద్వారా రూ.27,44,189 రూపాయలను ఖర్చు చేసినట్లు గుర్తించారు. ఉపాధి హామీలో సుమారు రూ. 8లక్షల అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీల్లో వెల్లడైందని గ్రామస్తులు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

చికిత్స పొందుతున్న మహిళ మృతి

కేసముద్రం: సెల్‌ఫోన్ పెట్టిన చిచ్చుతో ఓ తల్లి ప్రాణాలు బలైన విషాద సంఘటన ఇనుగుర్తి మండలం రాముతండాజీపీ శివారు రూప్లాతండాలో చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన నూనావత్ వెన్నెల(25), నరేష్ దంపతులకు చెందిన కుమారుడు ఈనెల 2న ఇంట్లో ఉన్న సెల్‌ఫోన్‌తో ఆటలాడుతుండగా, జారి కిందపడటంతో సెల్‌ఫోన్ పగిలిపోయింది. ఈ విషయంపై ఆగ్రహించిన భర్త నరేష్, తన భార్యను కొట్టాడు. దీంతో క్షణికావేశానికి లోనైన వెన్నెల గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స నిమిత్తం ఆమెను వరంగల్ ఎంజీఎంకు తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆమె శనివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

సంక్షిప్త సమాచారం

27 నుంచి మిర్చి కొనుగోళ్ల ప్రారంభం

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో ఈనెల 27వ తేదీ నుంచి మిర్చి కొనుగోళ్లను ప్రారంభించనున్నట్లు మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా, మార్కెట్‌లో మిర్చిని అమ్ముకుని, గిట్టుబాటు ధర పొందాలని ఆయన పేర్కొన్నాడు.

ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

మహబూబాబాద్ రూరల్: అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అందేలా చూడాలని మున్సిపాలిటీ 17వ వార్డు కాంగ్రెస్ కమిటీ సభ్యులు శనివారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డిని కలిసి విన్నవించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బండారి చిరంజీవి, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు లావుడియా రాంజీనాయక్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన

మహబూబాబాద్ అర్బన్: మైనర్లు బైక్‌లు నడిపితే వారి తల్లిదండ్రులు మూల్యం చెల్లించుకోవాల్సిందే అని జిల్లా రవాణా శాఖ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సాయిచరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో శనివారం రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

తొర్రూరు: ఆర్టీసీ సేవలను ప్రయాణికులు, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ ఖుర్షీషా ఖాన్ తెలిపారు. శనివారం డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను డీఎం పద్మావతితో కలిసి ఈడీ తనిఖీ చేశారు.

ముగిసిన శిక్షణ

గూడూరు: గొర్రెలు మేకల పెంపకంపై నాలుగు రోజులుగా మండల కేంద్రంలోని వడ్డెరగూడెం రైతువేదికలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా గిరిజన ఉపప్రణాళిక కింద గొర్రెల, మేకల పెంపకంపై అవగాహన కల్పించి, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో మాలతి, డాక్టర్ శ్రీనాథ్, శ్రీకాంత్, ఏఓ అబ్దుల్‌మాలిక్ పాల్గొన్నారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

కురవి: మండల కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన కామిండ్ల సైదమ్మ కూలి పనికి వెళ్లగా ఇంటి తాళాలు పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు కురవి ఎస్సై గండ్రాతి సతీష్ శనివారం తెలిపారు. లాకర్‌లో ఉన్న రూ.55వేలు అపహరించినట్లు ఆయన వివరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా సోమయ్య

నెహ్రూసెంటర్: మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పులి సోమయ్యను నియమిస్తూ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ గుగ్గిళ్ల పీరయ్య శనివారం తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

మహబూబాబాద్ రూరల్: జిల్లాలోని బయ్యారం మండలం లక్ష్మీనరసింహపురం గ్రామానికి చెందిన ఉల్లెంగుల లక్ష్మి శనివారం సాయంత్రం ఇంట్లో గల టీవీ పక్కన ఉన్న స్విచ్ ఆన్ చేస్తుండగా ఒకసారిగా మంటలు వ్యాపించి టీవీ పగిలిపోయింది. ఈ ప్రమాదంలో ఇంట్లో సామగ్రి కాలిపోయాయి. లక్ష్మికి రూ.లక్ష వరకు ఆస్తినష్టం సంభవించింది.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

డోర్నకల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. డోర్నకల్ మండలం దుబ్బతండాకు చెందిన ఇస్లావత్ భాషా(35) భార్య సుజాతతో కలిసి శనివారం ఇల్లెందు నుంచి డోర్నకల్ వస్తుండగా పాన్నెకల్లు సమీపంలో కాంక్రీట్ లారీ ఢీకొట్టడంతో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా రాత్రి భాషా మృతి చెందాడు. మృతుడి బంధువు ఇస్లావత్ అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కామెపల్లి ఎస్సై సాయికుమార్ తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: బాల కార్మికుడిని పనిలో పెట్టుకున్న ఓ ఇండస్ట్రీ ఇన్‌చార్జ్‌పై కేసు నమోదు చేశామని మహబూబాబాద్ రూరల్ ఎస్సై వి.దీపిక శనివారం రాత్రి తెలిపారు. అనంతారం గ్రామ శివారులో గల శ్రీనివాస ఇండస్ట్రీస్‌లో ఓ బాల కార్మికుడిని పనిలో పెట్టుకున్నారు. విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు అక్కడకు వెళ్లి బాల కార్మికుడిని అదుపులోకి తీసుకున్నారు. బాధ్యుడైన ఇన్‌చార్జ్ రాజేంద్ర ముఖియా అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

గేదెల చోరీ

మహబూబాబాద్ రూరల్: మండలంలోని రెడ్యాల, కంబాలపల్లి గ్రామాల పరిధిలో నాలుగు గేదెల చోరీకి గురికాగా బాధిత రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని రూరల్ ఎస్సై వి.దీపిక శనివారం రాత్రి తెలిపారు. రెడ్యాల గ్రామానికి చెందిన గంగారపు నాగేశ్వరరావు రెండు గేదెలు, వాటి దూడలను, కంబాలపల్లి గ్రామానికి చెందిన పన్నాల ఝాన్సీ తన గేదెను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించుకుని తీసుకునిపోయారు. బాధిత రైతులకు రూ.1.40లక్షల వరకు ఆస్తినష్టం సంభవించింది.

పాఠశాల కిటికీలు, తలుపులు చోరీ

కురవి: మండల కేంద్రం శివారు తులిస్యా తండా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో (కలప) తలుపులు, కిటికీలు, దర్వాజలు శనివారం చోరీకి గురయ్యాయి. తులిస్యా తండాలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు లేక పోవడంతో మూసివేశారు. తర్వాత కొత్తగా తులిస్యాతండా గ్రామ పంచాయతీగా ఏర్పడిన సమయంలో పాఠశాలను గ్రామ పంచాయతీ కార్యాలయంగా ఉపయోగించారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల కలప సామగ్రిని చోరీ చేసి ఎత్తుకెళ్లారు. కార్యదర్శి ఖదీర్ కురవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎంఈఓ బాలాజీని వివరణ కోరగా డీఈఓకు సమాచారం అందించనున్నట్లు తెలిపారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

తొర్రూరు రూరల్: మండలంలోని చెర్లపాలెం ప్రభుత్వ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇట్టి మాదవ్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని పరీక్ష సామగ్రి అందించారు. ఈసందర్భంగా ఎంఈఓ బుచ్చయ్య మాట్లాడుతూ.. దాతల సాయం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో సిరికొండ విక్రమ్‌కుమార్, కొత్త వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

గార్ల: అధికార పార్టీలకు చెందిన వారికే కాకుండా పార్టీలకు అతీతంగా అసలైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు జి.నాగమణి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. ఈమేరకు శనివారం ఎంపీడీఓ మంగమ్మకు ఆమె వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దేవా, వీర్యానాయక్, వీరన్న, రాంబాబు, రాజు, రమేష్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జనార్దన్

బయ్యారం: తుడుందెబ్బ జిల్లా ప్రధానకార్యదర్శిగా బయ్యారానికి చెందిన తాటి జనార్దన్‌ను ఎన్నుకున్నారు. ఈ మేర కు శనివారం బయ్యారంలో తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ ఆగబోయిన రవి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. ఎన్నికకు సహకరించిన ప్రతీఒక్కరికి కృతజ్ఞతలు తెలిపాడు.